AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్‌కు ఎన్నారై ఫిర్యాదు



**అక్షరటుడే, కోటగిరి:** మండలంలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని ఎన్నారై కోనేరు శశాంక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంత రం మైనింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పోతంగల్, హంగర్గా, కారేగాంలో యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తవ్వుతున్నారని.. అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు.



# ఇదేమి కక్కుర్తి భాస్కరా..!



▸ రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బోధన్ ఎస్సై

**ఆయన ఓ సబ్ ఇన్‌స్పెక్టర్. నెలవారీ వేతనం రూ.లక్షకు పైమాటే. ఇది చాలదంటూ రూ.7 వేల కోసం కక్కుర్తి పడ్డాడు. చివరికి ఏసీబీకి చిక్కాడు. తప్పు చేసిన వారిని కటకటాల్లో వేయాల్సిన అతగాడే.. చివరికి జైలు పాలయ్యాడు. ఈ ఘటన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పోలీస్ శాఖలో తీవ్రంగా చర్చనీయాంశంగా మారింది.**

**- అక్షరటుడే, బోధన్**

బోధన్ టౌన్ ఎస్సై భాస్కరాచారి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయకుండా ఉండడానికి ఎస్సై రూ.10 వేలు డిమాండ్ చేశాడు. అనంతరం బాధితుడితో రూ.7 వేలకు ఒప్పందం కుదురుకున్నాడు. సదరు బాధితుడి బంధువు ఈ విషయమై ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. తీరా.. స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదుదారు బుధవారం ఉదయం లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సోదాలు చేశారు. కేసు నమోదు చేసి ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

### గతంలో పలువురు ఎస్సైలు

ఉమ్మడి జిల్లాలో గతంలో పలువురు ఎస్సైలు ఏసీబీకి చిక్కారు. 2024 నవంబర్‌లో.. ఓ కేసులో స్టేషన్ బెయిల్ కోసం రూ. 20వేలు లంచం తీసుకుంటూ వర్ని ఎస్సై కృష్ణకుమార్ అడ్డంగా దొరికిపోయాడు. 2024 నవంబర్‌లో లింగంపేట ఎస్సై అరుణ్, రైటర్ రామస్వామి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. 2026 ఏప్రిల్ నెలలో బిచ్కుంద సీఐ సత్యనారాయణ ఏసీబీ అధికారులకు దొరికాడు.

కాగా.. ఎస్సై భాస్కరాచారి నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలుచోట్ల పనిచేశారు. ముప్కాల్‌లో అనంతరం నగరంలోని మూడో టౌన్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం బదిలీపై వేరే జిల్లాకు వెళ్లారు. తాజాగా బదిలీపై కమిషనరేట్ కు వచ్చి.. బోధన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. అయితే ఆది నుంచి ఆయన ఎక్కడ పనిచేసినా అవినీతి ఆరోపణలు బలంగా వినిపించాయి.

### వరుస దాడులు

రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాలోనూ దాడులు కొనసాగిస్తోంది. దీంతో అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టీవో ఆఫీసుల్లో ఇటీవల సోదాలు చేశారు. గతంలో ఆర్టీవో చెక్‌పోస్టులపై దాడులు చేశారు. అనంతరం ప్రభుత్వం వాటిని ఎత్తేసింది. ఇటీవల కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో అధికారులు సోదాలు చేశారు. ఏసీబీ దూకుడు పెంచడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఒకవైపు కొందరు అధికారులు భయపడుతుండగా.. మరికొందరు విచ్చలవిడిగా లంచాలు తీసుకుంటూ పాల్పడుతూ ఏసీబీకి పట్టుబడుతుండడం గమనార్హం.



## పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలి: పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** పంట మార్పిడి విధానాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలో బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోచారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయం తగ్గకుండా పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ అధికారులు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అధిక దిగుబడుల దిశగా రైతులు అడుగులు వేయాలని కోరారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పోచారం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం అక్రెడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 202628 కాల వ్యవధికి గాను ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. జీ.వో.252 ప్రకారం నిబంధనలకు లోబడి అర్హులకు కమిటీ సభ్యులు ఆమోదం తెలుపగా.. కమిటీ చైర్ పర్సన్‌గా మంజూరు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అర్హులైన జర్నలిస్టులకు జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్డులు జారీ జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఎం.ఉమేష్ చంద్రరావు, ఆర్టీసీ పీవో పద్మజ, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ.నర్సింలు, ఆర్.భూపతి, జి.సాయి ప్రసాద్, సీహెచ్.జాన్సన్, ఎంఏ.మాజిద్, కే.రాందయానంద్, ఎండీ గౌస్, ఎల్.బాల్ కుమార్, ఎస్.శ్రీకాంత్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద జింకపిల్ల లభ్యం..

**అక్షరటుడే, ఇందూరు:** ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద జింకపిల్లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వివరాలు వెల్లడించారు. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో బుధవారం ఉదయం ఒకచిన్న జింకపిల్లను కుక్కలు తరుముతుండగా అక్కడే ఉన్న సర్పంచ్ బట్టు సంజీవ్ రాజ్, రైతులు స్పందించారు. వెంటనే జింకపిల్లను కుక్కల బారి నుంచి కాపాడారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. ఈ సందర్భంగా జింకపిల్లను కాపాడిన సర్పంచ్, రైతులను అటవీశాఖాధికారులు అభినందించారు. అనంతరం జింకపిల్లను సమీప రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి ప్రత్యేక శిబిరాలు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలోని 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 21 ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే విద్యారోత్సవాల ప్రారంభం రోజు శిబిరాలు ప్రారంభం అవుతాయన్నారు. పీఎంశ్రీ పాఠశాలలలో 15 రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాలలో స్థానిక వసతుల ఆధారంగా స్టిచింగ్, సంగీతం, శాస్త్రీయ నృత్యం, డ్రాయింగ్, వ్యక్తిత్వ వికాసం, ఇండోర్ క్రీడలు, కరాటే, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలలో విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ లేదా స్నాక్స్ కూడా అందజేయబడతాయన్నారు. తాడ్వాయి మండల విద్యార్థులు కామారెడ్డి బాలుర పాఠశాలలో, మాచారెడ్డి మండల విద్యార్థులు పాల్వంచ పాఠశాలలో, మహమ్మద్ నగర్ మండల విద్యార్థులు నిజాంసాగర్ మోడల్ స్కూల్‌లో, డోంగ్లీ మండల విద్యార్థులు మద్నూర్‌లో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. కామారెడ్డి అర్బన్ విద్యార్థులు బాలుర పాఠశాలలో, రూరల్ విద్యార్థులు చిన్నమల్లారెడ్డి పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.


## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం: మోహన్ రెడ్డి



**అక్షరటుడే, భీమ్‌గల్:** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సికింద్రాపూర్‌లో లబ్ధిదారు మాలెపు అర్చన రాజు, బడా భీమ్‌గల్ శంకురి ప్రమీల, వేల్పూర్ మండలంలోని పడగల్‌లో మందల లింగుబాయి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. భీమ్‌గల్ మండలంలో ఇప్పటికే 60శాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నివాసం కల్పించాలనే కృత నిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. కార్యక్రమంలో భీమ్‌గల్ మున్సిపల్ చైర్మన్ బొదిరే స్వామి, వైస్ చైర్మన్ జేజే నర్సయ్య, కౌన్సిలర్ నాగేంద్ర బాబు, సర్పంచ్‌లు రమేష్, నరేందర్, రాజు, భూమారెడ్డి, సురేష్, ఉప సర్పంచ్ నరేందర్, మల్లారెడ్డి నరేష్, నితీష్, జలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎంపీ అర్వింద్ కృషి..

### జిల్లాలో మరో రెండు ఆర్వోబీలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో రైల్వే ప్రాజెక్టుల మంజూరు, నిర్మాణాల కోసం ఎంపీ అర్వింద్ చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమవుతున్నాయి. ఈ క్రమంలో ఆయన కృషి ఫలితంగా నిజామాబాద్ జిల్లాలో మరో రెండు ఆర్వోబీలకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నిజామాబాద్ జిల్లాలో మరో రెండు ఆర్వోబీల నిర్మాణాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందల్వాయి, జానకంపేట్ గూడ్స్ షెడ్‌ల వద్ద ఆర్వోబీల నిర్మాణాలను చేపట్టాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను, రైల్వే ఉన్నతాధికారులను కలసి పలుమార్లు విజ్ఞప్తులు అందించిన విషయం తెలిసిందే. తాజాగా నిజామాబాద్ జిల్లాలో ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయంపై ఎంపీ అర్వింద్ హర్షం వ్యక్తం చేశారు. తన పార్లమెంట్ పరిధిలో పది ఆర్వోబీల నిర్మాణాలు పూర్తిచేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని జానకంపేట్ -నిజామాబాద్ వద్ద ఎల్‌సీ 190 ఏ, అలాగే ఇందల్వాయి-సిర్నాపల్లి మధ్య ఎల్‌సీ 198ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) నిర్మాణాలను 'స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్' కింద గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ నిర్ణయం ద్వారా తక్షణమే భూసేకరణ చేపట్టే అవకాశం కలుగుతుందని, పరిపాలన అనుమతులు త్వరితగతిన లభిస్తాయని తెలిపారు.

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా సాయిరాం యాదవ్

**అక్షరటుడే, లింగంపేట:** కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా లింగంపల్లి కుర్దు గ్రామానికి చెందిన సాయిరాం యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని, అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేలా చూస్తానన్నారు.





## ఇందూరు మార్కెట్‌కు ఆమ్‌చూర్..



నిజామాబాద్ మార్కెట్‌కు యార్డుకు ఆమ్‌చూర్ పోటెత్తుతోంది. మామిడి సీజన్ కావడంతో గత నాలుగైదు రోజులుగా రైతులు అమ్మకం కోసం మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆమ్‌చూర్‌కు తెలంగాణలోనే నిజామాబాద్ అది పెద్ద మార్కెట్ కావడం నిత్యం వందల్ల క్వింటాళ్ల వచ్చి చేరుతోంది. ఇక్కడకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు కోరుట్ల, జగిత్యాల, రంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల నుంచి పంటను తీసుకువస్తున్నారు. నిత్యం రూ. 200 నుంచి 250 క్వింటాళ్లకు వరకు పంట తరలిస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డు మామిడి టంకర్ రాశులతో నిండిపోయింది. యేటా సీజన్‌లో సుమారు 8 వేల నుంచి 10 వేల క్వింటాళ్లు పంట మార్కెట్‌కు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వాలిటీ ఆధారంగా రూ. 25వేలు 28 వేలు ధర పలుకుతోంది. ఈ నెల మొత్తం పంట తరలివచ్చే అవకాశం ఉంది.

- అక్షరటుడే, ఇందూరు

## తాండూరు సింగిల్ విండో ఛైర్మన్‌గా ఆకిడి గంగారెడ్డి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలం తాండూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం తిరిగి పదవీబాధ్యతలు స్వీకరించింది. జిల్లా సహకార సంఘం అధికారి రామ్మోహన్‌రావు ఆదేశాల మేరకు తాండూరు సహకార సంఘం అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గంగారెడ్డిని రైతులు, గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతు సంక్షేమం, సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షుడు బాబురావు, డైరెక్టర్లు సంగయ్య, స్వరూప, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టయ్య, సంజీవులు, హనుమంత్‌రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఏగుల నర్సింలు





**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఏగుల నర్సింహులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఏగుల నర్సింహులు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు. కాంటాలు వేగంగా వేయాలన్నారు. వర్షాల వల్ల ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాబట్టి ఎక్కువ లారీలు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్, డైరెక్టర్లు సూర్య ప్రకాష్, బాలరాజు, లక్ష్మణ్, సుఖేందర్ రెడ్డి, సత్యవ్వ, గోపికృష్ణ, నారాయణ, నర్సింలు, అగ్రికల్చర్ ముఖిద్, సొసైటీ సెక్రెటరీ విశ్వనాథం, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయాగౌడ్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గీత కార్మికుల కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మోతుకూరు చంద్రశేఖర్ గౌడ్ నియామకమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లను, సభ్యులను నియమించింది. ఈ సందర్భంగా వీరి నియామకానికి సంబంధించి ఉత్తర్వులను సీఎస్ రామకృష్ణారావు బుధవారం జారీ చేశారు. జిల్లాలో సీనియర్ నాయకుడైన మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్‌కు గీత కార్మికుల కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. కాంగ్రెస్ నాయకుడు దయాకర్ గౌడ్ తదితరులు ఆయనను సన్మానించారు.

# కొలువుదీరిన పాలకవర్గాలు..



**ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గాలు తిరిగి బాధ్యతలు చేపడుతున్నాయి. గతేడాది డిసెంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పలువురు సింగిల్ విండో ఛైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం పాత పాలకవర్గాలకే తిరిగి పదవీ బాధ్యతలు అప్పగించాలని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో ప్రమాణస్వీకార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**

- **హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో..**
- **ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచనలు..**
- **రైతుల వెంటే ఉంటామంటున్న సభ్యులు**

### మాక్లూర్ సొసైటీ ఛైర్మన్‌గా అశోక్



**అక్షరటుడే, మాక్లూర్:** మాక్లూర్ సొసైటీ ఛైర్మన్‌గా బూరోళ్ల అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం పాలక వర్గాలను రద్దుచేసిన విషయం తెలిసిందే. నామినేటెడ్ పద్ధతిలో పదవులు చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ప్రక్రియ ఆలస్యం అవడం, ధాన్యం కొనుగోలు సేకరణలో ఇబ్బందులు తలెత్తడంతో తిరిగి పాత పాలక వర్గాలకే బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రైతులకు సేవ చేయడానికి మరోసారి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఆర్మూర్ పార్టీ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### బినోలలో మగ్గరి హన్మాండ్లు..



**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలం బినోల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా మగ్గరి హన్మండ్లు బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు పాలకవర్గం తిరిగి ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు, ఉపాధ్యక్షులుగా ఖాజా అషాముద్దీన్, పాలకవర్గ సభ్యులు ఆయిటి విజయ్, కట్ట అంజా గౌడ్, ప్రదీప్ రావు, బాలచందర్ గౌడ్, లక్ష్మి, మనోహర్ రావు, గంగాధర్, సంపూర్ణ, సీఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు. హన్మాండ్లు మట్లాడుతూ రైతులకు సేవచేసే భాగ్యం మళ్లీ కలిగిందన్నారు. న్యాయస్థానానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, బినోల సహకార సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ పరిధిలో ఇప్పటివరకు 70శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని.. మిగతా 30శాతం ధాన్యాన్ని తీసుకోవడంలో రైస్‌మిల్లులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని కోరారు. పాలకవర్గ సభ్యుడు యెండల నవీన్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణ కోసమే భద్రతా వారోత్సవాలు



**అక్షరటుడే, గాంధారి:** విద్యుత్ ప్రమాదాల నివారణ కోసమే భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ విజయసారథి పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని సర్వాపూర్ సెక్షన్ పరిధిలో సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ విజయసారథి మాట్లాడుతూ.. సిబ్బందికి పూర్తిస్థాయిలో విద్యుత్ లైన్‌లపై అవగాహన ఉండాలన్నారు. ప్రతినెలా లైన్ పెట్రోలింగ్ చేయాలని.. ఫీల్డ్‌లో పనిచేసేటప్పుడు తప్పనిసరిగా ఎర్త్ రాడ్ వాడాలని, హెల్మెట్, షూ ధరించాలన్నారు. రైతులు సొంతంగా ఫ్యూజ్‌వైర్లు మార్చవద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలు సైతం ఎక్కవద్దని.. ఏ సమస్య ఉన్నా వెంటనే సంబంధిత సిబ్బందికి, లేదా 1912లో ఫిర్యాదు చేయాలన్నారు. ఏడీఈ చీకోటి మల్లేష్, ఏఈ లక్ష్మయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మౌలానా పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర పొందడంపై రైతులకు అవగాహన




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం రైతు వారోత్సవాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తెచ్చి విక్రయించుకోవడంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న వివిధ వసతులు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా మార్కెట్ యార్డులో పంటలు విక్రయించి లబ్ధి పొందాలని ఛైర్‌పర్సన్ రజిత రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ జొన్నల రాజు, పాలకవర్గ సభ్యులు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్లేష్ మృతిపై మైనంపల్లి సంతాపం

**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండలం అక్లూరు గ్రామానికి చెందిన సీఐ గౌరీ ప్రశాంత్ సోదరుడు గౌరీ మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో బుధవారం అక్లూరులోని బాధితుడి నివాసానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు వచ్చారు. మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, అనంతరం ప్రశాంత్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లేష్ మృతి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కారేగాం ఇసుక క్వారీ పనులు నిలిపేయాలని గ్రామస్థుల ఆందోళన



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పోతంగల్ మండలం కారేగాం ఇసుక క్వారీలో తవ్వకాలను నిలిపేయాలని గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం లారీలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఈ సందర్భంగా పోతంగల్ మండలం కారేగాం గ్రామ సర్పంచ్ సునీల్ మాట్లాడుతూ.. మంజీర పరిసర ప్రాంతాల్లో కొన్ని వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయన్నారు. అయితే ఇసుకను అక్రమంగా తోడేస్తూ ఉంటే మంజీర కొన్నిరోజుల్లో ఎడారిలో మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని.. ఫిర్యాదులు ఇచ్చిన అనంతరం కొన్నిరోజులుకు వచ్చి తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారని వాపోయారు. మంజీర ను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇసుకను నిరంతరాయంగా తోడేస్తే చుట్టుపక్కల ఉన్న బోర్లన్నీ ఎత్తిపోతాయన్నారు. మాజీ సర్పంచ్ సాంబశివరావు మాట్లాడుతూ.. తక్షణమే కారేగాం ఇసుక క్వారీ నుంచి జేసీబీలు, లారీలు వెళ్లకపోతే తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అలాగే అనుమతుల పేరుతో రాత్రి 9 గంటల తర్వాత కూడా యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తోడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సతీష్, రామ్ పటేల్, అశోక్, రాజు, నాగనాథ్, శంకర్, శ్రీనివాస్ గజేందర్, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డుపై జారిపడ్డ ధాన్యం బస్తాలు

**డిచ్‌పల్లి స్టేషన్‌లోని నాగ్‌పూర్ గేటు ప్రాంతంలో లారీలో నుంచి ధాన్యం బస్తాలు జారిపడ్డాయి. డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండా కొనుగోలు కేంద్రం నుంచి నిజామాబాద్ వెళ్తున్న ధాన్యం లారీ నాగ్‌పూర్ గేటు వద్దకు చేరుకోగానే జారి కిందపడ్డాయి. రోడ్డుపై చెల్లాచెదురైన ధాన్యాన్ని హమాలీలు ఒకచోట చేర్చి మళ్లీ బస్తాలు నింపారు. రోడ్డుపై వృథాగా పోయిన ధాన్యం నష్టాన్ని ఎవరు భరిస్తారని రైతులు ఆవేదన చెందుతున్నారు.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**

## కాసేపట్లో కొడుకు పెళ్లి..

- **రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులకు గాయాలు**

**అక్షరటుడే, కామారెడ్డి :** కాసేపట్లో కొడుకు పెళ్లి. ఇంటినుంచి బంధువులంతా బయలుదేరుతున్నారు. పెళ్లికి సమయం కావస్తుండటంతో ఓ కారులో పెళ్లికొడుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బయలుదేరారు. 10 నిమిషాల్లో ఫంక్షన్ హాలుకు చేరుకునేలోగా వేగంగా వెళ్తున్న కారు కల్వర్టును ఢీకొని 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన చిదుర సిద్దిరాములు కొడుకు చిదుర భరత్ వివాహం కామారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో జరగనుంది. ఈ క్రమంలో పెళ్లికొడుకు తల్లిదండ్రులు, అతని సోదరి, ముగ్గురు చిన్నారులు కలిసి 8 మందితో కారులో ఫంక్షన్ హాలుకు బయలుదేరారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ దాటిన తర్వాత వీరి కారు రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకాగా అందులో ఉన్న 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పెళ్లికొడుకు తల్లీదండ్రులు వినోద, సిద్ధిరాములుకు తీవ్ర గాయాలు అయ్యాయి. మేనత్త పరిస్థితి విషమంగా ఉంది. మరికొంతమంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన కల్వర్టు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. కల్వర్టును కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు.



## కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా శామప్ప పటేల్



**అక్షటుడే, పెద్దకొడప్‌గల్ :** కాంగ్రెస్ పెద్దకొడప్‌గల్ మండలాధ్యక్షుడిగా శామప్ప పటేల్‌ను నియమించారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శామప్ప పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్య తోట లక్ష్మీకాంతారావుకు, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు శాయాశక్తులా కృషి చేస్తానన్నారు.